# అమెరి'కులాసా' కథలు

**– వంగూరి చిట్టెన్‌రాజు**





## – 13 –

## "తెలంగాణా ప్రపంచ" తెలుగు మహా సభలు -సరదాగా

**సుమారు ఐదారు** వారాల క్రితం ఒకాయన పిలిచి "మిమ్మల్ని హైదరాబాద్ లో జరుగుతున్న తెలంగాణా ప్రపంచ తెలుగు మహా సభలకి ఆహ్వానిస్తున్నాం" అని చెప్పినప్పుడు ప్రపంచ తెలుగు మహా సభలు తెలంగాణాలో జరుగుతున్నాయా లేక తెలంగాణా ప్రపంచంలో తెలుగు మహా సభలు జరుగుతున్నాయా అనే అనుమానం నాకు కలిగింది. ఏది ఏమైనా ప్రపంచస్థాయి తెలుగు మహా సభలు కాబట్టి అన్ని దేశాల నుంచీ తెలుగు వారు రావాలి కనుక అమెరికా నుంచి నన్ను పిలిచారు అనుకోడానికి నేనేమీ ఏ జాతీయ సంఘానికీ సూటూ, బూటూ వేసుకుని ఇంగ్లీషులో మాట్లాడే నాయకుడిని కాదు కదా...అంచేత వాళ్ళకి ఎక్కడో నా గురించి తప్పు సమాచారం అంది ఉంటుంది అనుకుని "రాంగ్ నెంబర్" అని ఫోన్ పెట్టెయ్యబోయాను.

ఆయన కంగారు పడి "లేదు సార్. ఇవి కేవలం భాష, సాహిత్యాలకి మాత్రమే సంబంధించిన సభలు. అందుకే మిమ్మల్ని పిలుస్తున్నాం" అనగానే నాకు అర్జంటుగా నాలుగు కొమ్ములు మొలిచేశాయి. ఎత్తు ఆరంగుళాలు పెరిగాను. అయినా నిలదొక్కుకుని "అంత అర్జంటుగా రావడం నాకు కుదరదు" అని కాస్త బెట్టు చెయ్యగానే ఆయన "ఒకే..మీరు రాకపోయినా పరవా లేదు లెండి. అమెరికా నుంచి రచయితలు, సాహితీవేత్తలలో ఇంకెవరిని పిలవాలో ఓ లిస్టు పంపించండి" అని నా ఆహ్వానాన్ని వెనక్కి లాగేసుకున్నాడు. వెంటనే నా కొమ్ములు మటు మాయం అయిపోయి వీరాంజనేయుడి వానరావతారం నుంచి నా ఒరిజినల్ బుద్ధావతరానికి వచ్చేశాను. ఏం చేస్తాం. నాలిక్కరిచేసుకుని, నా అప్రస్తుత ప్రసంగానికి లెంపలు వాయించుకుని ఆయన అడిగినట్టు ఓ పాతిక మంది అమెరికా రచయితల లిస్ట్ పంపించాను...

కానీ ఆశ్చర్యం ఏమిటంటే ఓ వారం తర్వాత ఇమెయిల్ లో నన్ను ఆ మహా సభలకి ఆహ్వానిస్తున్నట్టు ఆరు వాక్యాల ఉత్తరం వచ్చింది. అందులో నన్ను బాగా ఆకట్టుకున్న రెండు వాక్యాలు చదివి, కాలర్ ఎగరేసుకుని మా క్వీన్ విక్టోరియా తో "చూశావా వైఫూ...యువర్ హస్బెండ్ ఈజ్ ఇన్వైటెడ్." అని కాస్త గొప్పలు చెప్పుకుంటూ ఆ ఉత్తరం చూపించాను. అది చదివి ఆవిడ నన్ను గట్టిగా గిల్లి, నా కళ్ళు నులుమేసి మళ్ళీ మళ్ళీ ఆ వాక్యాలు చదివింది నమ్మలేక.

"మీకు రాను, పోను ఖర్చులు మహా సభల పక్షాన ప్రభుత్వమే భరిస్తుంది. ఈ మహా సభలు జరిగే ఐదు రోజుల పాటు మీకు సముచితంగా ఆతిథ్యం (వసతి, స్థానిక రవాణా, భోజన సదుపాయం) కల్పిస్తాం." అదీ ఆ వాక్యాల సారాంశం. నాకు తెలియక అడుగుతానూ....తనకి నమ్మకం లేక పోతే తనని తను గిల్లుకోవాలి, తన కళ్ళు తను నులుపు కోవాలి కానీ నాకు తొడపాశం పెట్టడం ఏం న్యాయంగా ఉంది చెప్పండి.

"ఆ సర్లే..ఏదో అలా రాసేశారు కానీ నిజంగా ఇస్తారా ఏమిటీ?" ఇచ్చినా ఓ ఏడాది వాళ్ళ చుట్టూ తిరగాలి. ఆ తరవాత నీ ఇష్టం" అనేసి టెంకి జెల్ల కొట్టేసి తన పనికి వెళ్ళిపోయింది మా క్వీన్ విక్టోరియా. ఏదైతేనేం ఆవిడ అనుమతి ఇచ్చేసిందిగా అని మరో డజను సొంత సాహిత్యం పనులు కూడా కలుపుకుని మహాసభలకి వారం రోజులు ముందు హైదరాబాద్ చేరుకున్నాను. మనసులో అనుమానం పీకుతోంది కాబట్టి ముందుగానే మహా సభల నిర్వాహకులని "టికెట్ మీరు కొంటారా? లేక నేను కొనుక్కుని వస్తే అక్కడ డబ్బు ఇస్తారా? అని అడిగితే "భలే వారే. మీరు కొనుక్కు రండి. ఇక్కడకి వచ్చాక మీ పని పడతాం" అన్న వైపు లో సమాధానం వచ్చింది.


ఎందుకైనా మంచిది అని హైదరాబాద్ లో విమానం దిగీ దిగగానే రవీంద్ర భారతిలో ఉన్న ప్రపంచ మహా సభల కార్యాలయానికి పరిగెత్తుకుని వెళ్లాను....జేబులో నా విమానం టిక్కెట్టు, వాళ్ళు పంపించిన ఆహ్వానం, నా పాస్ పోర్ట్, నాలుగు ఫోటోలు, వేలి ముద్రలు వెయ్యడానికి ఇంక్ పేడ్ వగైరాలతో సహా. ఆహ్వానం మీద ఒక సంతకం పెట్టిన అధికారులు నలుగురిలో ఒక రెడ్డి గారు మాత్రం ఆఫీసులో ఉన్నారు. వందల కొద్దీ ఆ జనంలో నేను నా అమెరికా వివరాలతో బతిమాల బట్టి ముందు కూచున్న సైంధవుడు గారు ఆ రెడ్డి గారిని కలవడానికి లోపలకి పంపించారు. నేను పరిచయం చేసుకోగానే "అదేమిటీ అప్పుడే వచ్చేశారు. మీకు హోటల్ సభల మొదటి రోజు నుంచే ఇస్తాం. ఇప్పుడే ఇమ్మంటే ఎలా?" అని ఆప్యాయంగా, ఆశ్చర్యంగా నన్ను ఆహ్వానించారు. చెప్పొద్దూ... అమెరికా నుంచి ఆహ్వానం మీద వచ్చిన మొదటి గౌరవ అతిథిగా నన్ను చూడగానే నాలుగు ఫోటోలు దిగి, మర్నాడు పేపర్లో వేయిస్తారు అనీ, నా విమానం డబ్బులు పువ్వుల్లో పెట్టి ఇస్తారనీ అనుకున్న నాకు ఈ ఆహ్వానంతో కించిత్తు చెమటలు పట్టెను. అంచేత ఆయన నన్ను కూచోండి అనకపోయినా, ఇండియా అలవాటు ప్రకారం ఆ గదిలో ఉన్న ఇరవై మందితో అష్టావధానం చేస్తున్నా నేను ఇరవై ఒక్క కుర్చీలో అనాలోచితంగా చతికిల పడిపోయాను. మరొక ఇండియా ఆఫీసు ఆచారం ప్రకారం ఒక అర క్షణంలో ఒకానొక బంట్రోతు చిన్న పేపర్ కప్పులో వేడి, వేడిగా పొగలు గక్కుతున్న టీ పట్టుకొచ్చి "ఊ తాగు. లేపోతే సల్లారి పోద్ది" అని నా మొహం ముందు పెట్టాడు. ఆ సమయంలో నాకు హఠాత్తుగా మా క్వీన్ విక్టోరియా, నా విమానం టికెట్ కోసం ఆవిడకి తెలియకుండా వాడిన ఆవిడ క్రెడిట్ కార్డు ఆ తేనీరు పొగలలో తారట్లాడుతూ కనపడి నా తక్షణ కర్తవ్యాన్ని గుర్తు చేశాయి. అప్పుడు నేను "జై వీరాంజనేయా" అనుకుని జేబులోంచి విమానం టికెట్టు, పద్నాలుగు వందల డాలర్ల పై చిలుకు క్రెడిట్ కార్డ్ బిల్లు పైకి తీసి ఆ రెడ్డి గారి ముందు పెట్టాను."

"వాటీజ్ దిస్...ఇదేంది ?" అంటూ అవి తిరగేశాడు.

"నా విమానం టికెట్ సార్. ఇక్కడికి రాగానే ఆ డబ్బు ఇస్తాం అని మెయిల్ పంపించారు కదా?" అన్నాను జంకుతూ. అప్పటికే నా అమెరికా గాంభీర్యం తెలంగాణా అధికారి దగ్గర మేకపోతు గాంభీర్యం అని తెలిసిపోయింది.

"అదా. మేం చాలా బిజీ. ఇంకా ఆ ప్రొసీజర్ ఆలోచించ లేదు. అంత జల్దీగా జాంతా నై. సభల ఆఖరి రోజుకి చూద్దాం. మొదటి రోజు పార్క్ హోటల్ లో చెక్ ఇన్ అవ్వండి. వెల్ కం టు తెలంగాణా". అనగా...సభలు జరిగే ఐదు రోజులూ అటెండెన్స్ వేయించుకున్నామా లేదా అని సదరు ప్రభుత్వం వారు గమనించి కానీ పైసలు ఇవ్వరు అని అర్థం అయిపోయింది.

ఇక మొదటి రోజు..అనగా డిశంబర్ 15 సాయంత్రం మహా సభల ప్రారంభోత్సవం ఒక్కటే కార్యక్రమం. కానీ ఆ రోజంతా ఎంత తంటాలు పడినా మా నమోదు సంచీ మాకు అందనే లేదు. అందులోనే మేము మెడలో వేసుకునే కుక్క గొలుసు, గుర్తింపు కార్డు ఉంటాయిట. అది లేకపోతే ఆ ప్రారంభోత్సవం జరిగే ఎల్బీ స్టేడియంలో అడుగు పెట్టడానికి వీల్లేదు. కానీ ఎంతయినా బ్రిలియంట్ ఫేలోని కాబట్టి ఆ సెక్యూరిటీ వాళ్ళు ఆ బేడ్జీలు తీవ్రంగా చెక్ చెయ్యడానికి రెండు గంటలు ముందే అక్కడికి వెళ్లి నా అమెరికన్ పాస్ పోర్ట్ చూపించి లోపలికి దూరిపోయాను. అన్ని గంటల ముందు వెళ్లాను కాబట్టి మొదటి వరసలోనే చతికిల పడిపోయే అవకాశం, తద్వారా అన్ని టీవీలలోనూ కనపడే అవకాశం వచ్చేసింది. ఈ మొదటి వరస ఆట నేను చాలా సార్లే ఆడుకున్నాను.




తీరా అక్కడ కూచున్నాక నా ఎదురుగుండా ఒక ముఖ్యమంత్రి గారి ఫోటోతో ఒక పెద్ద ఫ్లెక్సి కనపడింది. దాని ఫోటో ఇక్కడ జతపరిచాను. నమ్మండి, నమ్మక పొండి. ఆయన బొమ్మ క్రింద "హబిబ్లి ఛీఫ్ మినిస్టర్ ఆఫ్ తెలంగాణా" అని తెలుగులో వ్రాసి ఉంది. ఈ హబిబ్లీ ఏమిటా అని నేను అర గంట బుర్ర గోక్కుంటే అప్పుడు అర్థం అయింది...హాన్'బ్లె అనే ఆంగ్ల పదాన్ని యదాతధంగా తెలుగులో వ్రాశారన మాట. ప్రపంచ తెలుగు మహా సభలలో హాయిగా గౌరవనీయులైన తెలంగాణ ముఖ్య మంత్రి అని వ్రాయ వచ్చుగా! ఇలాగే "సినిమా ఆటోగ్రఫీ" అనీ, మరొక చోట 'ప్రముకుల పెసంగాలు' లాంటి తప్పులు దొర్లాయి అని విన్నాను కానీ ఇంత మెగా సభలలో ఆ మాత్రం సరదా లేక పోతే ఎలా?

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఇలాంటివి చిన్న పొరపాట్ల మాట ఎలా ఉన్నా నగరంలో పెట్టిన వందలాది ఫ్లెక్సీలలో ఒక్క సినిమా తార బొమ్మ కానీ, రాజకీయ నాయకుడి వెకిలి నవ్వుల బొమ్మ కానీ లేకుండా కేవలం కేసీఆర్ గారి ఫోటో, పక్కన ఒక కవి, రచయిత, సాహితీవేత్త బొమ్మ, వారి గురించి ఒక ప్రశంసా వాక్యం చూసి మహానందం వేసింది. ఎందుకైనా మంచిది అని బతికున్న వాళ్ళ బొమ్మలు వెయ్యకుండా ప్రభుత్వం వారు జాగ్రత్త పడ్డారు. అందుకే కాబోలు నా బొమ్మ ఎక్కడా లేదు! హ.హ.హ...

అన్నట్టు ..మొదటి రోజు నేను పార్క్ హోటల్ కి చెక్ ఇన్ చెయ్యడానికి వెళ్ళినప్పుడు నాకు ఒక గది ఇచ్చి 'మీ రూమ్ మేట్ శేషారత్నం గారు – మలేషియా నుంచి"అంది నేత్రా అనే తెలంగాణా టూరిజమ్ వారి అమ్మాయి. చెప్పొద్దూ ..నాకు చికాకు వేసింది..ఎందుకంటే నేను మొదటి నుంచీ నాకు రూమ్ మేట్లూ, గీమ్ మేట్లూ వద్దు, కావాలంటే సగం మంచం డబ్బు నేను ఇస్తాను. సింగిల్ రూమ్ ఇవ్వండి" అని చెప్తూనే ఉన్నాను. ఇప్పుడు నా రూమ్ మేట్ పేరు చెప్పగానే గొప్ప అవిడియా వచ్చి, "ఓ. శేషా రత్నమా, గ్రేట్" అన్నాను.

ఆ పిల్ల ఆశ్చర్య పోయి "మలేషియా శేషారత్నం గారు మీకు తెలుసా, మీది అమెరికా కదా" అంది.

"అబ్బే, తెలియదు. కానీ శేషా రత్నం అంటే అమ్మాయి కదా. సో..నో ప్రాబ్లెమ్, ఐ విల్ ఎడ్జస్ట్ అని చిన్న డ్రామా ఆడాను. ఆ పిల్ల బిక్క చచ్చిపోయి..అనుమానం తో ఓ సారి కాగితాలు తిరగేసి "ఆయన అమ్మాయి కాదు సార్. ఆయన మీ లాగే ఆయనే సార్" అంది.

"మరదే" అని నేను నా సామాను తీసుకుని బయటకి వెళ్ళిపోబోతుంటే పాపం ఆ అమ్మాయి సదరు శేషారత్నాన్ని ఇంకో గదికి మార్చేసి నాకు విడిగా గది ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఐదు రోజులూ ఈ శేషారత్నం అనే ఆయన ఎలా ఉంటాడో చూద్దాం అనే నా కోరిక తీరనే లేదు. ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే మలేషియా నుంచి వంద మంది ఐదు, ఆరో తరం తెలుగు వారు తరలి వచ్చారు. వాళ్లకి తెలిసినదల్లా స్థానిక మాలే, చైనా భాషలతో కలిసిన తెలుగు భాష మీద అమితమైన ప్రేమ. మన ప్రాంతీయ భేదాలు ..అనగా తెలంగాణా, ఆంధ్రా, రాయల సీమ అంటే వారికి తెలియదు. వారిలో చాలా మందిని నేను గత ఏడాది కౌలాలంపూర్ వెళ్ళినప్పుడు కలిశాను. ఇప్పుడు వాళ్ళు నన్ను చూడగానే ఆప్యాయంగా పలకరించగానే ఎంతో సంతోషం వేసింది.



మొత్తానికి మా నమోదు సంచీ, అందులో కార్యక్రమ కరదీపిక చూడగానే చాలా విషయాలు అర్థం అయ్యాయి. ముందుగా అర్థం అయిన విషయం ఈ మహా సభలు హైదరాబాద్ లో ఆరు వేరే వేరే వేదికల మీద ఏర్పాటు చేశారు. అంటే కవి సమ్మేళనం ఒక చోట, ఐదు కిలో మీటర్ల లో అవధానం మరొక చోట, శతక సాహిత్యం చర్చ మరొక నాలుగు కిలో మీటర్లు.....దాంతో ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకుని ఆ హాల్లో ఉండి పోవాలి కానీ మిగతా

వాటికి వెళ్ళడానికి ..అసలే హైదరాబాదు. ఆ ట్రాఫిక్ లో రవీంద్ర భారతి నుంచి, తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఇందిరా ప్రియదర్శినికి ఇష్టం వచ్చినప్పుడు వెళ్ళడానికి సమయం కుదరదు.

మరొక ముఖ్య విషయం ఆ ఐదు రోజులలో సుమారు వెయ్యి మంది వేదిక మీద పాల్గొంటున్న వారిలో తెలంగాణా వారు 90 శాతం. "ఆధ్వర్యం మనదే, అధ్యక్షత మనదే, ఆధిపత్యం మనదే, అసలు తెలుగు మనదే. కానీ ఎవరైనా రావచ్చును" అనే విషయమూ "తెలంగాణ ప్రాశస్త్యాన్ని దశదిశలా చాటుదాం" అనే లక్ష్యమూ ముందునుంచీ తెలిసినవే కాబట్టి ఇది ఎక్కువ ఆశ్చర్యం కలగ లేదు. ఆశ్చర్యం అల్లా అమెరికా నుంచి అన్ని ఖర్చులూ పెట్టి ఆహ్వానించిన సుమారు ఇరవై మంది సాహితీవేత్తలలో కేవలం మూడు పేర్లే ఆ కరదీపికలో కనపడ్డాయి. అందులో ఇద్దరు తెలంగాణా కవులు. మూడో పేరు నాది. పైగా నా పేరు పక్కనే "గౌరవ అతిథి" (అమెరికా) అని చూసి ఎవరూ చూడకుండా ఒక అర క్షణం కాలర్ ఎగరేసుకున్నా, మరు క్షణమే నా పేరు ఎందుకు వేశారో కంటే ఇంకెవరి పేరూ ఎందుకు వెయ్య లేదో నాకు అర్థం అవ లేదు. అంటే వారు "అగౌరవ అతిదులా?" అని భయం కూడా వేసింది.

ఇక రెండో రోజు రాత్రి ఒక తమాషా జరిగింది. మూడో రోజు నేను పాల్గొనే కార్యక్రమాలు ఏమీ లేవు కాబట్టి నేను రహస్యంగా రెండో రోజు రాత్రి కాకినాడ చెక్కేసి, మా పి.ఆర్. కాలేజ్ పూర్వ విద్యార్థుల వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మళ్ళీ రాత్రికి రాత్రి వెనక్కి వచ్చేద్దాం అని ప్లాన్ వేసుకున్నాను. ఆత్మీయురాలు కుప్పిలి పద్మ రైల్వే స్టేషన్ కి వెళ్ళడానికి ఊబర్ కారు తెప్పించింది. తీరా స్టేషన్ దాకా వెళ్ళగానే కేసీఆర్ గారి పౌర సంబంధాధికారి గారు ఫోన్ చేసి "రేపు రాత్రి ముఖ్య మంత్రి గారు మీకు..అంటే ఎన్నారైలకి విందు ఇస్తున్నారు. మీతో ప్రత్యేకంగా మాట్లాడతారు" అని చెప్పగానే నేను రహస్యంగా కాకినాడ చెక్కేస్తున్న బండారం బయట పడిపోతుందేమో....నా విమానం డబ్బులు...అక్షరాలా లక్ష రూపాయలు ...అంటే మా క్వీన్ విక్టోరియా గారి క్రెడిట్ కార్డ్ డబ్బులు ఇవ్వరేమో అని హడిలి చచ్చి పోయి, వెనక్కి హోటల్ కి వెళ్లి పోయాను.

మర్నాడు రాత్రి కేసిఆర్ గారి కేంప్ ఆఫీసులో విందు భోజనం, అక్కడ సూటూ, బూటూ వేసుకున్న విదేశీ కార్యకర్తల తొక్కిస లాటలు,



'గౌరవ అతిథి' ని కాబట్టి నన్ను సెక్యూరిటీ వారు కొట్టకుండా కేవలం క్రిందకి తోసి వేయుట వగైరా వివరాలు నా ఫేస్ బుక్ లో వ్రాశాను. ఆ ఎన్నారై ప్రత్యేక సభలో ఆయన ఆంధ్రా వాళ్లకి తెలుగు రాదు అని నిరూపించడానికి ఒక ఉదాహరణ ఇచ్చారు. "రాజమండ్రి జైలు నుంచి



ఖైదీ పరారీ" అనే పత్రికలో వచ్చిన వార్తే ఆ ఉదాహరణ. ఎందుకంటే ఇందులో ఒక్క రాజమండ్రి తప్ప జైలు, ఖైదీ, పరారీ అన్నీ ఉర్దూ మాటలే కదా. నాకైతే ఆయన లాజిక్ సమఝ్మయి ఆంధ్రోల్ల తెలుగు మీద పరేషాన్ కలిగింది.

అమెరికా ఆహ్వానితుల పేర్లు కరదీపికలో లేక పోవడం పట్ల బెంగ పెట్టుకున్న నేను విందు భోజనం సమయంలో కేసీఆర్ గారి కుమార్తె, విదేశీ ప్రతినిధుల గోష్టికి ముఖ్య అతిథి అయిన కవితక్క దగ్గరకి వెళ్లి ఆ మర్నాటి గోష్టి ఎలా నిర్వహిస్తారు అని లేవనెత్తిన ప్రశ్నలకి ఆవిడకీ నాకూ కొంచెం వాదోపవాదాలు జరిగాయి. "అమెరికా వాళ్ళని ప్రేక్షకులుగా ఆహ్వానించాం. ప్రకటించిన మనం తప్ప ఇంకెవరూ



మాట్లాడడం కుదరదు” అని కవితక్క నాతో స్పష్టంగా నొక్కి వక్కాణించి కుండ బద్దలు కొట్టారు. ఆ మర్నాడు రవీంద్ర భారతిలో జరిగిన ఆ సభలో అధ్యక్షుల వారు మార్కుల కోసం ప్రసంగించారు అనిపించింది కానీ వంగూరి ఫౌండేషన్ గురించి సముచితంగా చెప్పి నాకు గౌరవం చేశారు. వీటన్నిటి నేపధ్యంలో నా ప్రసంగం కొనసాగింది.

నా ప్రసంగంలో “కేసీఆర్ గారు ఈ వంటకం చాలా బాగా వండారు. ఇది తెలంగాణా చారు. ఇందులో ఆంధ్రా కర్వేపాకు వేశారు.” అనే తొలి వ్యాఖ్య కాస్త సంచలనం సృష్టించి చాలా పేపర్లలో వచ్చింది. దానికి అధ్యక్షుల వారు స్పందించి “మీరు మమ్మల్ని చారులో కల్యామాకు చేశారు కానీ మేము మిమ్మల్ని ఉప్పులా కలుపుకున్నాం” అన్నారు. ఈ కల్యామాకు అంటే ఏమిటో నాకు తెలియదు. కానీ ఉప్పు తక్కువ వేస్తే చప్పగా ఉంటుంది. ఎక్కువ వేస్తే ఉప్పగా ఉండడమే కాకుండా బి.పి. పెరుగుతుంది. ఈ ప్రపంచ తెలుగు మహా సభలలో ఉప్పు సమపాళ్ళలో ఉందో లేదో ఎవరి రుచి వారిదే కాబట్టి పెద్ద ఇబ్బంది లేదు. ఆ సభలో తెలంగాణాలో తెలుగు ఆవిర్భావం, సాహిత్య పోషణ గురించి కవితక్క చేసిన 40 నిముషాల ప్రసంగం చాలా సాధికారికంగా విలువైన సమాచారాన్ని అందించింది. భాషా సాహిత్య విషయాలలో ఆమె తండ్రికి తగ్గ కూతురు అనే చెప్పుకోవాలి.



ఇవే మహా సభలు అంధ్ర ప్రదేశ్ లో జరిగితే ధన బలం, రాజకీయ బలం ఉన్న ఒక కులం, సాహిత్య బలం ఉన్న మరో కులం బలా బలాలు తేల్చుకుంటాయి తప్ప భాషా సాహిత్యాలకి ఇంత ప్రాధాన్యత ఇస్తారో లేదో తెలియదు. నన్ను ఆహ్వానించడం ద్వారా తెలంగాణా తల్లి నన్ను దత్తత తీసుకుంది అనే నా భావన. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, వారి అమెరికా అనుయాయులు అయితే బహుశా నన్ను ఇలా అన్ని ఖర్చులూ పెట్టి ఆహ్వానిస్తారు అనుకోను. ఎందుకంటే నా తసమ దీయుడి అర్హతలు సరిపోవు. అన్నింటికీ అతీతంగా ఉండవలసిన భాషా సాహిత్య విషయాలలో కూడా ఒక చోట ప్రాంతీయ వాదం. మరొక చోట కుల సంవాదం....అమెరికాలో వ్యక్తిగత ఇష్టాలు, అయిష్టాలు.



మొత్తానికి తెలంగాణా ప్రభుత్వం సాక్షాత్తూ సాహితీవేత్త, భాషాభిమాని అయిన ముఖ్య మంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో నిర్వహించిన ప్రపంచ మహా సభలు చాలా దిగ్విజయంగా జరిగాయి. నాకు వ్యక్తిగతంగా చాలా గౌరవం జరిగింది. ఒక సాహితీ సభకి వంద మందిని పోగెయ్యడానికి అష్టకష్టాలూ పడే ఈ రోజుల్లో తెలంగాణాలో ఇన్ని వేల మంది ప్రజానీకం కవులని, రచయితలని చూడడానికి, వినడానికి రావడానికి స్ఫూర్తి మాన్యులు కల్వకుంట్ల చంద్ర శేఖర రావు గారే.

ఈ నూతన సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ లో నాయకత్వం భాషా సాహిత్యాల విషయంలో ఉన్న అవగాహనా రాహిత్యాన్ని సరిదిద్దుకుని, సరి అయిన బాటలో ప్రయాణం చేస్తారని ఆశిస్తూ....అందరికీ శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాను.

**COMMENTS**